కార్డు కథలు | కార్డు వ్యాసాలు

# స్త్రీలు నీచులా?

"జగం"

ఏమిటీ! మీ యిష్టంవచ్చినవాణ్ణి చేబట్టి—నా జీవితాన్ని నాశనం చేసుకోవాలా?—నాన్నగారూ, కన్నకూతురునైనా దయ లేదూ మీకు?—ఏమిటీ మీనీతి! మీ పెంపుడుకుక్కకన్నా కన్న బిడ్డ నీచమా?—కుక్కకు వొల్లుకాలం వచ్చిందనగానే వూరంతా గాలించి చక్కటి జతను కూర్పజూస్తారే! ఆ కుక్కకున్న గౌరవం కూతురుపైనలేదా? మీ కుక్కకు వూరకుక్క నేల జతచేయ గూడదు?—సిగ్గులేక ఎలా ఆ అందహీనుని జేరమంటూన్నారు అంతా!—వూరకుక్కవల్ల పిల్లలు అందహీనంగా పుట్టుతవనేకదా జాతికుక్కను ఏరడం? నాకుమాత్రం నీచులైన పిల్లలుపుట్టరా?—మీ కుక్కకున్నంత అందం నాకులేదా? మానవులు అన్నిజీవుల కన్నా జ్ఞానవంతులంటారే! ఇదేనా జ్ఞానం?—ఇప్పుడు ఆలోచించండి మీలో ఏమాత్రం జ్ఞానంవుందో. పశువులకన్నా మానవులు ఇట్టివిషయాలలో అజ్ఞానులని బోధపడ్డంలేదూ? కుక్కకు చక్కటి పిల్లలు పుట్టాలనిచూస్తారు కాని తమ కూతుంర్రగురించి ఆలోచించరేం?—వ్యామోహపీడితులై సంచరించేది మనుష్యులే కాని పశువులుకావు సుమండీ! నోరులేనిమృగాలు మిమ్మల్ని యిష్టానిష్టాలు తీర్చమని కోరుతూన్నవా? నోరుగలిగి అడిగేవాళ్ళను నీచపరుస్తారే ఇదీ పరోపకారమంటారా?—ఏం; మాట్లాడరేం? డబ్బున్నదని కూయాపినీ—త్రాగుబోతునూ—వ్యభిచారునీ పెండ్లిచేస్తారా?—ఇకనెప్పుడూ ఇలా మాట్లాడకండి. తండ్రియైనంతమాత్రంచేత—మీ ఇష్టమొచ్చినట్లు నడువాలనికోరకండి.—ఇట్టి అన్యాయపద్ధతి అవలంబించకండి—మీ కుక్కకన్నా మానవాంగన తక్కువని భావించకండి.—నాన్నగారూ! మీ యుద్దేశ్యం మార్చుకోక నన్ను బలవంత పరుస్తే పశువులా—బానిసనై పడివుండలేను. ఆత్మహత్య చేసుకొంటాను సుమండీ!—మానవుల "జన్మహక్కు" అరికట్టడానికి మీకేం అధికారంవుంది? మీదృష్టిలో కుక్కలకన్నా స్త్రీలు నీచులా? ఏం; స్త్రీలు నీచులా?

# ఆంధ్రత్వం

వి. కైలాసరావు.

ఆంధ్రభాషకు ఆంధ్రులు కల్పించే లోపములు ఆంధ్రభాషకు పూర్వమైన ద్రోహం చేయుటే అంటాను. ఆంధ్రము అన్నింటిలోనూ చాలా మృదుమధురమైన భాష. మీరు వ్రాసే వ్యాసములలో ఇంగ్లీషుమాట ఉపయోగించుచున్నారు. ఎందుకుపయోగించుచున్నారని అడిగినట్లయితే, 'తెలుగుభాషలో, ఇంగ్లీషుపదములకు తగినపదములులేవ'ని,—లాగలేని యెద్దు పడుకొని దొంగయెత్తువేసినట్టుగా,—వంకపెట్టుట ఏమియూ బాగులేదు. తెలుగు సినిమాలలో అనగా పోతన, బాలనాగమ్మ మొదలగువాటిలో సామెతలనే వజ్రములనుపయోగించినట్లయితే పండితపామరులకు, వినడానికింపుగానుండును. తెలుగు చిత్రములలోకూడా ఇంగ్లీషు పదములుపయోగించుచున్నారు. అలాచేసినట్లయితే ఇంగ్లీషు చదువుకోని వాళ్ళకు ఆ ఆంగ్లేయభాష తెలియక తబ్బిబ్బగుదురు. పక్కవాళ్ళను, భాగోతంలోలాగ వెయ్యిగిల్లుతుండడము జరుగుచున్నది. అందులోకీ వద్దివారికి తెలుగుభాష తెలియదు. తెలియకపోయినా చూద్దామని ఆసక్తితోవచ్చి యేమియు తెలియక నక్క ద్రాక్షవళ్ళ సంగతి జరుగుచున్నది.

ఆంధ్రులలో చాలామందికి హిందీ సినిమాలు, పాటలు అంటే చాలాయిష్టము. పొరుగింటిపుల్లకూర రుచియని, యనుకొనుచున్నారు. గ్రామవాసులకు తెలిసేభాష యుపయోగించినట్లయితే చాలా బాగుంటుంది. ఇతరుల భాషాచారము లనుకరించబట్టే భారతీయులను బానిసలంటున్నారు. భారతమాతకు దుర్యోధనసంపత్తివలె 40 కోట్లమంది యున్నాము ఎందుకూ పనికిరాకుండా, బానిసత్వపు సంకెళ్ళు విడిపించుటకు మనమందరము పట్టుదల వహించినట్లయితే యెందుకు స్వరాజ్యమురాదు? ఆంధ్రులంతా కలిసి రాజమండ్రిలో రేడియోస్టేషను, విశాఖపట్నములో తెలుగుచిత్రములు తీయుస్థలమును, ఆంధ్రదేశమునకు ప్రత్యేకరాష్ట్రమును సాధించవచ్చును. అందరూ కలసి పనిచేసినట్లయితే కొండను పిండిచేయవచ్చును.